# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన ప్రజలు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.**

2. **సుపరిపాలనా పునాదులను బలోపేతం చేసేందుకు పబ్లిక్ సర్వీసు కమిషన్లు కీలకపాత్ర పోషించాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సూచించారు.**

3. **ఆంధ్రప్రదేశ్ లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ఈరోజు ఉదయం ప్రారంబిస్తారు.**

4. **ద్వేషించే వారిని కూడా ప్రేమించడాన్ని యేసు క్రీస్తు ఆచరించి చూపారని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు.**

==========================

ఆధ్యాత్మిక చైతన్యం కలిగిన ప్రజలు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా నిన్న నిర్వహించిన సదస్సులో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ ప్రాచీన జ్ఞానం, ఆధ్యాత్మిక వారసత్వం ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న మానసిక, నైతిక, పర్యావరణ సమస్యలకు పరిష్కారం చూపుతుందని వెల్లడించారు. వసుధైక కుటుంబం భావన నేటి ప్రపంచ శాంతికి అత్యంత అవసరమని పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

--------------------------

సుపరిపాలనా పునాదులను బలోపేతం చేసేందుకు పబ్లిక్ సర్వీసు కమిషన్లు కీలకపాత్ర పోషించాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సూచించారు. హైదరాబాదు రామోజీ ఫిల్మ్‌సిటీలో రెండు రోజుల పాటు జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో నిన్న పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు నిష్పాక్షికతే నైతిక పునాదిగా ఉండాలన్నారు. వినూత్న ఆలోచనలు, నైతికత, ప్రజల పట్ల సానుకూల దృక్పథం కలిగిన సివిల్ సర్వెంట్లు అవసరమని ఆయన తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ఈరోజు ఉదయం ప్రారంభించనున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి.వీరపాండియన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రకటనలో వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు, రాష్ట్రంలోని 54 లక్షల 7 వేల 663 మంది 5 ఏళ్ల లోపు పిల్లలకు 38 వేల 267 బూత్ లలో పోలియో చుక్కలు వేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు అన్ని జిల్లాలకు నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు.

-------------------------

ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమమైన విజయవంతం అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏడాది కాలంగా 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ప్రతి నెలా పాల్గొంటూ పరిశుభ్రతపై అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి వస్తున్న స్పందన, సమాజంలో కనిపిస్తున్న మార్పు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని వెల్లడించారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే వినూత్న కార్యక్రమం 'ముస్తాబు' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఉత్తమ అభ్యాస విధానంగా ఉన్న ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

-------------------------

ద్వేషించే వారిని కూడా ప్రేమించడాన్ని ఏసు క్రీస్తు ఆచరించి చూపారని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిన్న నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీస్తు స్ఫూర్తితో తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని తెలిపారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఏసు క్రీస్తు అందించారని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

-------------------------

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు గ్రామాల అభివృద్ధికి అనుసంధానించబడుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నిన్న జరిగిన చౌదరి చరణ్ సింగ్ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లుతో గ్రామీణ పేదలు, వేతనదారుల కుటుంబాలకు మరింత భరోసా లభిస్తుందని వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన కోసం వ్యవసాయ రంగంలో నిపుణుల సూచనలు, సలహాలను మంత్రిత్వ శాఖ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర

సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ధ్యానం ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్న లక్ష్యంతో డిసెంబరు 21ని 'అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ధ్యానం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీవితంలో, సమాజంలో పెరుగుతున్న ఒత్తిళ్లు, హింస వంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం మార్గంగా ధ్యానం ఉపయోగపడుతుంది. ధ్యానం మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. రోగనిరోధక శక్తిని అనేక రెట్లు పెంచుతుందని నిపుణులు చెప్తున్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలన్నదే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు నగర పరిధిలోని పలు ఫ్లై ఓవర్ ల పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి పై ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా చేపట్టనున్న ఫ్లై ఓవర్లకు స్థల సేకరణ ప్రక్రియ ప్రారంభించనున్నామని తెలిపారు. చెన్నై – తిరుపతి వెళ్లే వందే భారత్ రైళ్లను తెనాలి లో ఆపాలనే వినతికి అధికారులు సానుకూలంగా స్పందించారని పెమ్మసాని వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు తెలియజేస్తూ..

వాయిస్...27 సెకన్లు

మరోవైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఏజన్సీ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల నుంచి 10 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడివాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో ఈ రోజు అక్కడక్కడా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

======================